# ప్రణయేశ్వరి

- డి. వి. ఎస్. ఆర్. మూర్తి

''అర్హత వుండాలి'' అంది ఈశ్వరి ఇంచుమించు మందలింపు ధోరణిలో. అది ఒక హెచ్చరిక కూడా. తన వెంట పడడం మానమని ఖచ్చితంగా చెప్పడమే.

ఆ మాటలు శ్రీరామ్ నెత్తిన పిడుగులు పడ్డట్టు పడ్డాయి. దొంగ ఊబిలో కూరుకుపోతున్నట్లుంది.

తాను నిర్మించుకున్న ప్రణయ సామ్రాజ్యం ఒక్కసారి పేకమేడలా కూలింది. తన ఈశ్వరి తనేమిటో గుర్తు చేసింది. అది తానూహించలేదు. ఆ షాక్‌లోంచి తేరుకోవడానికి కొన్ని క్షణాలు పట్టింది.

అప్పుడు ఈశ్వరి మాటల వెనుక అర్థం అతడికి తేటతెల్లం అయింది. ఇంకా అర్థం కానిది ఒక్కటే మిగిలింది. తన వికారానికి అలా ఆకారం అప్పుడే ఎందుకు రూపుదిద్దింది?

నిజానికి ఈశ్వరి అందాల రాశి. అంత అందం ఆడవాళ్లలో అరుదే. దివి నుండి భువికి దిగివచ్చిన శృంగార దేవతే.

ఆ విషయం ఈశ్వరికి తెలుసు. తన అందం తనకొక వరం. దానితో తనకు అందంలో, అంతస్తులో పోటీ పడేవాడిని జీవిత భాగస్వామిగా పొందవచ్చు.

ఆ ధైర్యం ఈశ్వరికి వున్నట్లు అతడికి తెలుసు. అది గర్వంగా మారి తనను హెచ్చరించి కించపరిచే స్థితి ఎలా వచ్చిందో ఒక్కసారి మెరుపులా అతడిముందు తళుక్కుమంది.

ఈశ్వరి మిస్ ఆంధ్రాకు పోటీ చేసింది. అందాల రాణుల పోటీలో పాల్గొంటుందని శ్రీరామ్ కలలో కూడా అనుకోలేదు. కారణం ఆ పోటీ ఆడదాని అంగాంగ సౌందర్యానికి వెలకట్టడమే. ఆ పోటీలు నేటి ఆడపిల్లలపై పాశ్చాత్య ప్రభావం ఎంత వుందో తెలుపుతున్నాయి.

శ్రీరామ్ ఆ పోటీ ప్రదర్శనకు వెళ్లాడు. అమ్మాయిలు అందంగా, శృంగార బొమ్మల్లా తయారయ్యారు. ఒక్కొక్కరే వేదిక మీదకు వచ్చారు. ఒంపుసొంపులని ఎలా ప్రదర్శించాలో అలా చూపించారు. మన్మథ బాణాలను సంధించారు.

ఈశ్వరి ముందు అందరూ అక్కడ తీసికట్టే. దానితో మిస్ ఆంధ్రా కిరీటం ఆమెకే దక్కింది.

ఇక మిస్ ఇండియా, మిస్ వరల్డ్‌కు ఈశ్వరి పోటీ చేసినా ఆశ్చర్యంలేదు. అప్పటినుండి ఆంధ్రా ఐశ్వర్యారాయ్‌లా పోజులు పెడుతోంది. అది శ్రీరామ్ గమనించాడు. కానీ ఈ అనుకోని దాడికి సిద్ధంగాలేడు.

కారణం అతడికి ఈశ్వరి చిన్నప్పటి నుంచీ తెలుసు. ఆమె తండ్రి రాజవరంలో పెద్ద లాయరు. అతడి దగ్గర శ్రీరామ్ తండ్రి గుమస్తా.

తండ్రితోపాటు వెళ్లడం ఈశ్వరితోపాటు వాళ్ల ఇంట్లో గడపడం అతడికి పరిపాటే. ఘన విజయాలు సాధించిన మగాడి వెనుక ఒక స్త్రీ వుంటుంది. అది తన పట్ల నిజం అయింది. తన విజయాలకు ఊపిరి ఈశ్వరే.

అప్పటివరకూ ఈశ్వరి అతడిలో అందాన్ని చూసింది. దాన్ని వెలుగులోకి తెచ్చింది. అది ఇప్పుడు ఆమెకు కనుమరుగైనట్లు రూఢీ అయింది.

నిజానికి శ్రీరామ్ ఆమె ముందు దిగదుడుపు. ఈశ్వరి హండ్రెడ్ కాండిల్ బల్బు. తాను దీపపుసిమ్మె.

కన్నూ ముక్కూ తీరు వున్నా అతడిది నీలమేఘచ్ఛాయ. అది ఈశ్వరికి అడ్డవుతుందని ఊహించలేదు. దానితో తొందరదపడ్డానా అని ఆలోచించుకున్నాడు.

''అంటే?'' ప్రశ్నించాడు ఆలోచనలోంచి బయటపడి. ఈశ్వరి తనకు లేదనుకున్నాడు.

''అందరికీ పల్లకి ఎక్కాలనే వుంటుంది'' అంది ఈశ్వరి వెక్కిరింపును జోడించి.

''అయితే నేను మోసేవాడిలా కనిపిస్తున్నానా?'' శ్రీరామ్ మనస్సు చివుక్కుమంది.

''మోయించుకునేవాడిలా మాత్రం కనిపించడంలేదు'' ఏదో ఛళుకు విసిరినట్టు చిరునవ్వు చిందించింది.

''నేనేమిటి?''

''మిస్ ఆంధ్రా''

''మరి నీవు?'' ఆ ప్రశ్నకు సమాధానం ఈశ్వరి నోటి చివరివరకు వచ్చింది. నీవు బొంతకాకివి. తుమ్మదుంగవు. పగలు చూస్తే రాత్రి కల్లోకి వచ్చి భయపెడతావు''. ఈ మాటలు ఆమె పెదవులు దాటలేదు.

''నేను కాకిని, నీవు దొండపండువు'' అన్నాడు శ్రీరామ్.

''కాదా?'' ఎదురు ప్రశ్న వేసింది ఈశ్వరి.

''అయితే అంతకు తగ్గ బొంతవు చూచుకోమంటావు''

''అందని ద్రాక్షపండ్లకు అర్రులు చాచవద్దు అంటాను'' ఈశ్వరి చకచకా అక్కడినుండి నడిచింది.

శ్రీరామ్ ఏదో మైకంలోంచి హఠాత్తుగా బయట పడినట్లుంది. అప్పుడు అతడిముందు ప్రత్యక్షమయ్యాడు మోహన్.

మొదటి నుండీ అతడికి పోటీ మోహన్. అతను అక్కడ మరొక లీడింగ్ లాయరు కొడుకు. ఆస్తిపాస్తులు, అంతస్తులో ఈశ్వరికి తగినవాడు.

పైగా మోహన్ తెలివితేటలలో అతడికి తీసిపోడు. ఇక అందంతో ఈశ్వరితో పోటీపడగలడు.

న్యూక్లియర్ ఫిజిక్స్‌లో యూనివర్శిటీ ఫస్టు సాధించాడు. డాక్టరేట్ తెచ్చుకున్నాడు. లెక్చరర్ అక్కడే అయ్యాడు.

ఈశ్వరికి అతడంటే మోజు. లెక్చరర్ అవగానే ఈశ్వరితో మోహన్ పెళ్లి అయిపోయిందన్నారు. ఎందుకు జరగలేదో ఎవరికీ తెలీదు.

తరువాత ఈశ్వరికి సంబంధాలు చూచాడు తండ్రి నాగరాజారావు. ఒక్కటీ ఈశ్వరికి నచ్చలేదు.

తనకోసమే ఈశ్వరి పెళ్లి చేసుకోలేదేమో అన్న భావం శ్రీరామ్‌కు వచ్చింది. అది గట్టిపడింది. అప్పుడు అది తాను చేసిన ప్రయత్నానికి దారి తీసింది.

ఆడపిల్ల మనసు తెలుసుకోవడం కష్టం అని తెలిసింది శ్రీరామ్‌కి. అప్పటికే చేతులు కాల్చుకున్నాడు.

అయినా శ్రీరామ్ బాధపడలేదు. ఈశ్వరి అతడి హృదయంలో నిలిచింది. చిరునవ్వు చిందించింది.

అంతే శ్రీరామ్ ముందడుగు వేశాడు.

★★★

''నా మనసు ఆనందంతో పరవళ్లు తొక్కుతోంది'' అన్నాడు మోహన్. అది ఈశ్వరికి చెప్పడానికే ఎదురు చూచాడు.

విశ్వవిద్యాలయంలో చేరినప్పటి నుండి అతడి దృష్టి అమెరికా మీదే. అతడి కల పండింది. సదరన్ యూనివర్శిటీ ఆఫ్ న్యూ ఆర్లియన్సులో స్కాలర్‌షిప్పు సంపాదించాడు. ఇక ఈశ్వరిని పెళ్లి చేసుకోవడం, ఇద్దరూ కలసి అక్కడకు వెళ్లడం. ఏర్పాట్లన్నీ పూర్తయ్యాయి. అందుకే అంత ఆనందం.

ఈశ్వరీ ఆ క్షణానికే ఎదురు చూసింది. ఆ క్షణంలో తండ్రి గుర్తుకువచ్చాడు.

ఆడపిల్ల తోటకూర కాడలాంటిది. ఇట్టే వాడిపోతుంది. మోహన్ కోసం ఎదురుచూచి జీవితం పాడుచేసుకోవద్దని హెచ్చరించాడు. దానిని పట్టించుకోలేదు. తన పనికి మంచి ఫలితం వచ్చింది. ఆలోచనలు ఆమెను మత్తెక్కించాయి.


అప్పుడు చీకటి పడుతోంది. ఇద్దరూ మేడ ఎక్కారు. ఎదురెదురుగా కూర్చున్నారు. అప్పుడు తన

ఆనందాన్ని వెల్లడి చేశాడు మోహన్.

''ఎందుకో?'' ఈశ్వరీ ఏమీ తెలియనట్లుంది.

మోహన్ సమాధానం చెప్పలేదు. ఇంకొంచెం దగ్గరకు జరిగాడు. ముఖంలో ముఖం పెట్టాడు: ''ఇంత అందాన్ని ఇంతకాలం ఎందుకు సొంతం చేసుకోలేదు?'' అంటూ చప్పున వేలితో బుగ్గమీద చిత్రాలు గీచాడు.

ఇంకా ఏదో ఆమె అందాన్ని ఆస్వాదించేవాడిలా ఆమె ముఖాన్ని రెండు చేతులతో నొక్కాడు. ''నిజంగా ప్రపంచ సుందరివే'' అంటూ పొగిడాడు.



ఈశ్వరికి ఆ స్పర్శ ఏదో వెచ్చగా ఉంది. అది మనస్సుని గిలిగింతలు పెట్టింది. అది కొత్త అనుభూతి. అది ఆమె శరీరం కోరుతున్నట్లుంది.

దానితో ఇంకేమీ చేస్తాడో చూద్దాం అనుకుంది ఈశ్వరి. ఆమె ఊహించినట్లే ఆమెను ఆమె అందాలను వెదకసాగాడు.

ఈశ్వరి మనస్సు లయ తప్పింది. ఏదో ఊహలలో తేలిపోయింది. ఆనందపు అంచులను చేరినట్లుంది. ఆమె శరీరం వికసించిన పుష్పం అయింది.

ఆమెలో మదనుడు చోటు చేసుకోవడం మోహన్ గ్రహించాడు. ఏం చేసినా ఈశ్వరి వద్దనదు. ఇక తనను బాహువులలో బంధిస్తుంది.

మోహన్ ఎదురు చూసిన క్షణం అదే. అతడూ కాముడి వశం అయ్యాడు. ఎన్నడూ చేయని చొరవ చేసాడు.

ఈశ్వరికి ఏదో షాక్ తగిలినట్టయింది. ''వద్దు'' అంటూ అతడికి దూరం అయింది.

''ఐ లవ్ యూ'' అన్నాడు మోహన్ తేరుకుని.

''ఐ టూ లవ్ యూ''

''మరి?''

''డేటింగులు, మీటింగులు అమెరికాలో''

ఫక్కున నవ్వింది ఈశ్వరి.

''అందాల రాణుల పోటీలు అక్కడివే'' దెప్పి పొడిచాడు మోహన్ మాటలతో.

''అందాలు ప్రదర్శించేవారు అందాలు దాచుకోరు''

''ఈ పోటీయే నా కళ్లు తెరిపించింది. నేనేమిటో నా సంస్కృతేమిటో గుర్తు చేసింది. ఏది సుందరమో తెలుసుకున్నా''

''చాలా ఎదిగిపోయావే?''

''నీ ధర్మమా అంటూ చాలా తెలుసుకున్నాను''

''నీకు కాబోయే భర్తగా నీ అందాలు నావి కావా?''

''ఇప్పుడు నేను నీ భార్యను కానుగా''

''అంటే నా మీద నమ్మకం లేదన్నమాట''

''ప్రశ్న అది కాదు. పెళ్లి ముందా? శృంగారం ముందా? ఇదీ ప్రశ్న''

''శృంగారం స్త్రీకి సింగారం''

''పెళ్లిముద్ర పడిన శృంగారమే సింగారం. అగ్నిసాక్షిగా ఏడడుగులు భర్తతో నడవాలి. ప్రథమ సమాగమానికి ఎదురుచూడాలి. నా అందంలో ఆనందబీజాలు నాటాలి. అద్వైతానుభూతి పొందాలి. అందులోనే వుంది సృష్టి''

''హేట్సాఫ్ టు యూ'' మెచ్చుకున్నట్లు అన్నాడు. మోహన్ తన చిరుకోపాన్ని దిగమ్రింగుతూ.

''ఐ లవ్ యూ మోర్''

''ఐ టూ లవ్ యూ''

''అయితే నీవే నా హృదయ రాణివి''

★★★

''ఏదో ఒకటి వెంటనే చెప్పాలి'' అన్నాడు నాగరాజారావు.

మోహన్‌తో ఈశ్వరి పెళ్లికి ముహూర్తం పెట్టి పంపడం జరిగింది.

''చెప్పకపోతే'' ప్రశ్నించింది ఇందుమించు నిర్లక్ష్యంగా.

''చెప్పకపోవడానికి కారణం అయినా చెబుతావా? అసలు మోహన్‌ను చేసుకుంటావా? చేసుకోవా? ఇప్పుడు చెప్పకపోతే నా పరువు గంగపాలు అవుతుంది''

''మోహన్ ఏం చేసాడో మరచావా?'' ప్రశ్నించింది ఈశ్వరి గతం గుర్తు చేస్తూ. అతడు అప్పుడు పెళ్లి వాయిదా వేశాడు. ఎందుకు? అతడి దృష్టి అమెరికా మీద వుంది. నామీద లేదు''

''అతడి మంచి ఏదో అతడు చూసుకున్నాడు''

''నా మంచి నేను చూసుకోకూడదా? అమెరికా కోసం నన్ను వదులుకోవడానికి సిద్ధం అయ్యాడు. అంటే అమెరికా అందం ముందు నా అందం ఓడిపోయింది''

అప్పుడు నాగరాజారావుకి కథ అర్థం అయింది. శ్రీరామ్ సివిల్ సర్వీస్ పరీక్షలో నాల్గవస్థానం సంపాదించాడు. అంటే కలెక్టర్ అన్నమాట.

తన పట్టణంలో ఎక్కడ విన్నా శ్రీరామ్ సాధించిన విజయం గురించే. ప్రైవేట్ చానల్స్‌లో అతడిని చూపించారు. రాష్ట్రానికే అతడు గర్వకారణం అన్నారు. ఆ కార్యక్రమం ఈశ్వరి చూసింది.

కానీ శ్రీరామ్ అంటే ఈశ్వరి మనసులో ఏం వుందో అతడికి తెలుసు. అతడు బొంతకాకి. తాను హంస. చచ్చినా ఆ తుమ్మ దుంగని చేసుకోదు.

మరి ఇప్పుడు శ్రీరామ్ కలెక్టర్. రేపు గవర్నర్. అతడు ఎదగడానికి ఆకాశమే హద్దు. అధికార హోదా, డబ్బు ఉంటాయి. అందరూ పెద్ద పీట వేస్తారు.

అయినా కాకి ఎప్పుడూ హంసకాదు. కానీ శ్రీరామ్ ఐఎఎస్. ఈశ్వరికి హంసలా కనిపిస్తున్నాడా?

నాగరాజారావుకి అంతా అయోమయంగా వుంది. ఏది ఏమైనా ఈశ్వరి తలచుకుంటే తాను ఏమీ చేయలేడు. అది ఎప్పుడో రుజువయింది. కానీ కూతురు మనసులో ఏముందో అంతుపట్టలేదు.

అంతలో శ్రీరామ్ అక్కడ ప్రత్యక్షమయ్యాడు. అది తండ్రీ కూతుళ్లు ఊహించలేదు.

''కంగ్రాట్స్. ఐయామ్ ప్రౌడాఫ్ యూ'' అన్నాడు చేయి అందిస్తూ నాగరాజారావు.

''మై హార్టీ కంగ్రాట్స్'' అంది ఈశ్వరి.

శ్రీరామ్ చేతులు జోడించి ''థాంక్స్'' అన్నాడు.

నాగరాజారావు ఏదో గుర్తుకువచ్చినవాడిలా లోపలికి నడిచాడు.

''కమాన్'' అంటూ ఈశ్వరి లేచింది. నేరుగా శ్రీరామ్‌ను వెంటబెట్టుకుని తన పడగ గదికి నడిచింది.

శ్రీరామ్‌కు అది కలలా వుంది. ఈశ్వరి పడకగదిలోకి కాలుపెట్టడం అతడి జీవితంలో కల్ల. అది నిజం అయింది. కారణం అతడు కలెక్టర్.

ఈశ్వరి మాటలు స్ఫురణకు వచ్చాయి. అర్హత వుండాలంది. ఇప్పుడు అర్హత వచ్చిందా అన్న ఆలోచనలో పడ్డాడు. ''కూర్చో'' అన్న మాటలు అతడిని వాస్తవంలో పడేసాయి.

ఈశ్వరి వెళ్లి తలుపు గడియపెట్టింది. అది చూచి శ్రీరామ్ వెంటనే లేచి నిలబడ్డాడు. కొంచెం భయపడ్డాడు.

''గడియ వేసేవేంటి?'' అన్నాడు అప్రయత్నంగా.

''అత్యాచారం చేద్దామని'' పకపకా నవ్వింది ఈశ్వరి.

''ఈ బొంత కాకి మీద మిస్ ఆంధ్రా అత్యాచారం చేయదు. నేను నీలి మేఘం. నీవు జాబిలివి''

''సముద్రం నీలం. ఆకాశం నీలం. అవి అందంగా లేవా? అందం చూసేవాడి కళ్లలో వుంది. రాముడు నలుపు. కృష్ణుడు నలుపు, శివుడు నలుపు. దేవుళ్లది నీ ఛాయే''

''నేను మానవుడిని''

''నేను దేవతనా?'' ఎదురు ప్రశ్న వేసింది ఈశ్వరి.

''దేవతలే రూపాన్ని పట్టించుకోలేదు. పట్టించుకుంటే రుక్మిణి ప్రేమలేఖ కృష్ణుడికి పంపేదికాదు. శివుడి కోసం ఈశ్వరి తపస్సు చేయదు''

''మరి నీవు మోహన్ కోసమే కదా ఎదురు చూచావు?''

''ఎదురుచూసాను.'' అంది ఏమీ సంకోచించకుండా ఈశ్వరి.

''ఎప్పటివరకు నీవు కలెక్టర్ కానంతవరకూ''

''అయినా ఇప్పుడు కలెక్టర్ బొంతకాకినే''

''బొంతకాకివయినా, బొగ్గు అయినా కలెక్టర్ కలెక్టరే. అంటే రాజువి. నీకు భార్యనయితే నేను రాణిని. దానితో నాకో అంతస్తు. దానివెంట అందమైన జీవితం. అంతకంటే ఏ ఆడపిల్లకు ఏం కావాలి? నీవు నలుపైతే ఏమిటి?''

''కలెక్టర్‌నంటావు'' శ్రీరామ్ మూడోకన్ను తెరుచుకుంది. శరీరాలు కలవడం శృంగారంకాదు. వాటి వెనుక వున్న మనస్సులు శృంగారం కావాలి. అందంలో ఆనంద బీజాలు శివమ్‌ను పండించాలి. అప్పుడే కొత్త సృష్టి. అతడి ఆలోచనలు అతడిని అంతర్ముఖుడిని చేశాయి.

''కనుక నీకో బహుమతి'' వెంటనే ఈశ్వరి తన కుర్చీలోంచి లేచింది. వెళ్లి శ్రీరామ్ ముందు నిలబడి చేయి సాచింది.

''ఏమిటో ఆ బహుమతి?'' ఈశ్వరి చేయి అందుకుని శ్రీరామ్ ఆమె ముందు నిలబడ్డాడు. ఆశ్చర్యంతో ఉబ్బితబ్బిబయ్యాడు.

''చెప్పాలా?'' అంటూ ఈశ్వరి అతడిని తన బిగి కౌగిలిలో బంధించింది. ''ఇదీ'' అంటూ బుగ్గమీద ముద్దు పెట్టింది.

శ్రీరామ్ శరీరం పులకించింది. మనస్సు పరవశించింది.

ప్రణవమే ప్రణయం!

అంతే! ఈశ్వరి అతడి ముందు లేదు. ఏదో అద్వైతానుభూతిలో అప్రయత్నంగా అతడి నోటివెంట మాటలు వెలువడ్డాయి.

ప్రణయేశ్వరి!

★

## జయ చిత్ర(మ్)!



ఒకప్పటి హీరోయిన్‌లు చాలా మంది ఇప్పుడు తల్లి , అక్క, వదిన వేషాలు లాంటివి వేస్తూ తిరిగి చిత్ర రంగ ప్రవేశం చేస్తున్నారు. వాళ్లలో కొంతమందికి కలిసొచ్చి బిజీగా కూడా మారుతున్నారు. హీరోయిన్‌గా తెలుగు, తమిళ చిత్రాల్లో ఒకప్పుడు బిజీగా వున్న జయచిత్ర ఆమధ్య కొన్ని చిత్రాల్లో తల్లి వేషాలు వేసింది. అబ్బాయిగారు, ఘరానా బుల్లోడు లాంటి చిత్రాల్లో ప్రాముఖ్యతగల పాత్రల్ని పోషించినా కూడా తగినంత బిజీ కాలేకపోయిందనే చెప్పాలి. మళ్లీ కొంత గాప్ తర్వాత ఇప్పుడు కె. రాఘవేంద్రరావు దర్శకత్వం వహిస్తున్న 'లవ్‌స్టోరీ 1999'లో నటిస్తోంది జయచిత్ర. తనదైన స్టయిల్‌గల జయచిత్ర కెరీర్‌కి ఈ సినిమా మలుపు తెస్తుందేమో!

-జె.ఎం.